సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
78932 44734
నంబర్‌ను సంప్రదించండి

'పశ్చిమ'లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలి

- నియోజకవర్గంలో రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు
- మౌలిక సౌకర్యాలకు మరో రూ.40 కోట్లు మంజూరు
- మరో సారి జగన్‌ను సీఎం చేద్దాం
- పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఆదారి ఆనంద్ కుమార్


ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఆనంద్ కుమార్


సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు,వలంటీర్లు, గృహసారథులు

విశాఖ విద్య: రాజకీయాలు, కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలకు అందించిన సంక్షేమ పథకాలే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికి శ్రీరామరక్ష అని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, ఏపీఎంఎస్ఎంఈడీసీ చైర్మన్ ఆదారి ఆనంద్ కుమార్ అన్నారు. ఎన్ఏడీ సెంటర్‌లోని ఉమియా భవన్ లో శనివారం క్లస్టర్ -3 (52,56,57 వార్డులు)కి సంబంధించి క్లస్టర్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్ల తో 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' అనే కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా మనం పని చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివద్ధి పనులను ప్రజలకు వివరించి ప్రతీ ఇంటా వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు దృష్టి సారించాలన్నారు.

అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి

పశ్చిమ ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఇప్పటికే రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని, మరో రూ.40 కోట్లతో మౌలిక వసతుల కల్పించేందుకు నిధులు మంజూరు చేయించామన్నారు. మీరంతా ఓట్లేసి గెలిపించిన టీడీపీ ఎమ్మెల్యే ఏనాడైనా కాలనీల్లో పర్యటించారా అని ప్రశ్నించారు.ఇంటింటికీ వెళ్లి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఎలాంటి సంక్షేమ పథకాలు అందాయనేది ప్రజలకు చెప్పాలన్నారు. ఈ సందర్భంగా 52వ వార్డుకు చెందిన ఎనిమిది మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు.

గెలుపు మనదే

పశ్చిమ నియోజకవర్గంలో ఈ సారి వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. క్లస్టర్ -3 పరిధిలోని వార్డుల నుంచి భారీ మెజార్టీ వచ్చేలా నాయకులంతా పని చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణ(అల్లా కృష్ణ), 57వ వార్డు కార్పొరేటర్ ఎం.వాణి , సింహాచలం ట్రస్టుబోర్డు సభ్యురాలు శ్రీదేవి వర్మ, 56వ వార్డు అధ్యక్షులు ఆదారి శ్రీను, క్లస్టర్ ఇన్‌చార్జి పల్లా ఎర్నికుమార్, నాయకులు సురేష్ ,52వ వార్డు అధ్యక్షుడు జియ్యాని మారుతి, వివిధ వార్డుల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఐక్యతతో పనిచేద్దాం

మల్కాపురం: వచ్చే ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయంతో పాటు మరోసారి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేద్దాం.. అందుకు నేటి నుంచే అంతా ఐక్యతతో పని చేద్దామని ఏపీ సూక్ష్మ చిన్న మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ పిలుపునిచ్చారు. పారిశ్రామిక ప్రాంత క్లస్టర్ ఇన్‌చార్జిలు, కన్వీనర్లతో స్థానిక ఆడిటోరియంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఆంధ్రకు జగనే సీఎం కావాలి అన్న నినాదాన్ని మనమంతా గట్టిగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల కోసం అనేక సంక్షమ పథకాలు ప్రవేశ పెట్టి, వాటి ద్వారా ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించారన్నారు. రాష్ట్రంలో పేదరికం తగ్గుముఖం పడుతుందంటే అందుకు కారణం జగన్ తీసుకున్న నిర్ణయాలే అని అన్నారు. జగన్ చేసిన మేలును ప్రజలకు గృహసారథులు,కన్వీనర్లు, అనుబంధ సంస్థల ప్రతినిధులతో పాటు ప్రతి కార్యకర్త ప్రజలకు వివరించాలని కోరారు.

బాబు మోసాలు వివరించండి

నమ్ముకున్న ప్రజలను చంద్రబాబు ఎలా మోసం చేశారో..పలు స్కామ్‌లలో చంద్రబాబు,టీడీపీ నాయకులు దోచుకున్న వైనాన్ని ప్రజలకు వివరించి వారిని చైతన్య వంతులు చేయాలని సూచించారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, అంగ రామ్‌ప్రసాద్,భోగవల్లి నాగభూషణం, కార్పొరేటర్లు బల్లా లక్ష్మణరావు,కొణతాల సుధ,గుండపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

త్రినాథపురంలో మీకోసం-మీ పోలీస్


నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ దేముడుబాబు

సింథియా: మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధి త్రినాథపురంలో శనివారం నేరాల నియంత్రణపై మీ కోసం -మీ పోలీస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ దేముడుబాబు మాట్లాడుతూ నేరాల నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. విధి నిర్వహణలో పోలీసులకు సహకరించాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకూ సుమారు 150 మంది గంజాయి వినియోగించే వారిని అదుపులోకి తీసుకుని వారికి కౌన్సెలింగ్ ఇచ్చి సన్మార్గంలో నడిపించామని చెప్పారు. కార్పొరేటర్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలకు పోలీసులపై ఉన్న భయం తొలగించేందుకు మీ కోసం-మీ పోలీస్ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. సచివాయల మహిళా పోలీస్ సునీత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గణపతికి పూజలు


ఆనంద్‌కుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు

గోపాలపట్నం: గవర వీధిలో గౌరీ యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని శనివారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ సందర్శించారు. గౌరీ సేవా సంఘం సభ్యులు, గౌరీ యూత్ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించి స్వామివారి శేషవస్త్రాలు, చిత్రపటాలను అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 90వ వార్డు అధ్యక్షుడు చుక్క ప్రసాదరెడ్డి, కోరుబిల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలు తొలగిస్తున్న ఎస్ఐ వాసుదేవ్

విశాఖ విద్య: ఎన్ఏడీ సెంటర్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణలపై ట్రాఫిక్ పోలీసులు శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పెందుర్తి వైపు వెళ్లే బీఆర్‌టీఎస్ రహదారితో పాటు బాజీ జంక్షన్‌లో ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన దుకాణాలు తొలగించారు. ఎస్ఐ వాసుదేవ్ సిబ్బందితో బాజీ జంక్షన్‌లో పర్యటించి ఫుట్‌పాత్ ఆక్రమణలు గుర్తించారు. తొలగించాలని దుకాణదారులకు సూచించారు. అయినప్పటికీ దుకాణదారుల నుంచి స్పందన లేకపోవడంతో తమ సిబ్బందితో వెళ్లిన వాసుదేవ్ స్వయంగా వాటిని తొలగించారు. వాహనాల రద్దీ దృష్ట్యా ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ కోరారు.

80 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వార్డు ఎన్ఏడీ సమీపంలోని వాకింగ్ పార్కుల్లో శనివారం మర్రిపాలెం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కేర్ ఆస్పత్రి వైద్యులు సుమారు 80 మందికి బీపీ, సుగర్, ఈసీజీ వంటి పరీక్షలు చేశారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ ప్రజాహిత కార్యక్రమాలు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొలుసు నాగేశ్వరరావు, కార్యదర్శి వి. జాకబ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈటి సత్యనారాయణ, కోశాధికారి డి. లక్ష్మణరావు, డైరెక్టర్ గంటా రెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మేనేజింగ్ కమిటీ ఎన్నికల్లో ఎన్సీఈ ఘన విజయం


విజయోత్సవంలో ఎన్నికైన సభ్యులు

సింధియా: నేవల్ డాక్‌యార్డ్ క్యాంటీన్ మేనేజింగ్ కమిటీ ఎన్నికల్లో సీఐటీయూ, టీఎస్‌టీయూసీ, డీఐటీయూ, వైఎస్సార్‌టీయూసీ బలపరిచిన ఎన్‌సీ ఈ యూనియన్ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా ఎన్‌సీ ఈ యూనియన్ ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ వరుసగా ఐదోసారి ఎన్నికల్లో గెలిపించిన కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో గెలుపొందిన జీఏ స్వామి, జి.శ్రీనివాసరావు, అంగ నానాజీలను కార్మికులు సత్కరించారు.

జీవీఎంసీ తరహాలో షెల్టర్లు నిర్వహించాలి


మాట్లాడుతున్న ఏయూటీడీ కార్యదర్శి వాసు

సీతంపేట: విశాఖపట్నంలో నిరాశ్రయులకు జీవీఎంసీ నిర్వహిస్తున్న తరహాలో రాష్ట్రంలోని 32 పట్టణాల్లో ఉన్న 89 షెల్టర్ల నిర్వహణ బాధ్యత ప్రభుత్వం చేపట్టాలని అసోసియేషన్ ఫర్ అర్బన్ అండ్ ట్రిబల్ డెవలప్‌మెంట్(ఏయూటీడీ) కార్యదర్శి ప్రగడ వాసు కోరారు. ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్ కార్పొరేషన్లు, 50 వేల జనాభా ఉన్న మున్సిపాలిటీల్లో మెప్మా, డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కలిసి రాష్ట్రంలో 89 షెల్టర్లు మంజూరు చేసి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఆయా షెల్టర్ల నిర్వహణకు నిధులు మంజూరు చేసిందని, 32 షెల్టర్లకు గడువు పూర్తి కావడంతో నిధులు నిలిపివేశారన్నారు. గడువు పూర్తయిన షెల్టర్లకు మరో రెండేళ్ల కాలపరిమితి పొడిగిస్తూ, మున్సిపాలిటీలను సొంత నిధులతో నడపాలని మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. జీవీఎంసీ పరిధిలో తప్ప రాష్ట్రంలో మరెక్కడా మంత్రి ఆదేశాలు అమలు కాలేదని, ఫలితంగా షెల్టర్లు మూతపడే స్థితికి వచ్చాయని తెలిపారు. ప్రభుత్వం షెల్టర్లలో సౌకర్యాలు మెరుగుపర్చాలని వాసు కోరారు.

10న కొత్తపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం


మాట్లాడుతున్న ఏపీడీ శ్రీరామ్

గోపాలపట్నం: ఈ నెల 10న కొత్తపాలెంలో నిర్వహించబోయే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీడీ శ్రీరామ్ కోరారు. శిబిరంలో 7 మంది వైద్య నిపుణులు పాల్గొంటారన్నారు. ఇక్కడ వైద్య పరీక్షలు చేసి తగిన సలహాలతో పాటు ఉంచితంగా మందులు అందిస్తారని పేర్కొన్నారు. ఇప్పటికే ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారని తెలిపారు. ఈ గొప్ప అవకాశాన్ని ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, శానిటరీ సూపర్‌వైజర్ కేవీ రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు అయితంశెట్టి గోపాలకృష్ణ, ఆళ్ల పైడిరాజు, సచివాలయ కార్యదర్శులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

సర్వే పరిశీలన

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్-343 సచివాలయం పరిధిలో ఆరోగ్య సిబ్బంది, వార్డు వలంటీర్లు నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ వైద్య సేవలను ప్రజల ముంగిటకే అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష ప్రవేశపెట్టారన్నారు. శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యులు ఉచితంగా ఉచిత వైద్య పరీక్షలతో పాటు ఉ మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


టోకెన్లు అందిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

'ఆరోగ్య సురక్ష'తో పేదలకు భరోసా


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం మల్కాపురం, ఆర్‌కేపురం,ప్రకాష్‌నగర్, జనతాకాలనీ,ఇండస్ట్రియల్‌కాలనీ,గాంధీజీవీధి తదితర ప్రాంతాల్లో ఏఎన్ఎంలు,ఆశ వర్కర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. బీపీ,సుగర్,యూరిన్,టీబీ తదితర వైద్య పరీక్షలు చేశారు. ఆర్‌కేపురంలో వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ఆమె మాట్లాడుతూ పైసా ఖర్చులేకుండా వైద్యులు వైద్య పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన మందులు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నరవ హైస్కూల్‌లో పొలంబడి


పాఠశాల ఆవరణలో మొక్కలు నాటేందుకు స్థలాన్ని సిద్ధం చేస్తున్న విద్యార్థులు

గోపాలపట్నం: జీవీఎంసీ 88వ వార్డు నరవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం వంటివి నేర్పించారు. పాఠశాల ఆవరణలో కొంత భాగాన్ని మొక్కలు నాటేందుకు అనువుగా తీర్చిదిద్దారు. వాటిలో వంగా, టమాటా, మిరప, కాలీఫ్లవర్, క్యాబేజీ వంటి కూరగాయల మొక్కలను విద్యార్థుల చేత నాటించారు. వాటిని ఏవిధంగా పెంచాలో వివరించారు. మొక్కలు నాటి వాటి బాధ్యతలు స్వీకరించిన విద్యార్థుల పేర్లను ఆయా మొక్కల వద్ద ఏర్పాటు చేశారు. దీని వల్ల వారికి బాధ్యతగా ఉంటుందని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ కార్ప్ విద్యార్థులు, బయాలజీ ఉపాధ్యాయురాలు రమణి, కె.ప్రసాద్, పీఈటీ లక్ష్మీనారాయణ, జేడీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు


సింహగిరిపై వ్యాపారులకు సూచనలిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: సింహగిరిపై వ్యాపారులు నిషేధిత ప్లాస్టిక్ సంచులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి హెచ్చరించారు. జోన్-8 జెడ్సీ మల్లయ్యనాయుడుతో కలిసి శనివారం సింహగిరిపై షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాపారులకు పలు సూచనలు చేశారు. నిషేధిత ప్లాస్టిక్ వ్యాపారులు ఎవరూ వాడవద్దని సూచించారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, షాపుల వద్ద చెత్తాచెదారాలను వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే మారిటైం హెరిటేజ్ కాంప్లెక్స్ ఏర్పాటు

- వీపీఏ చైర్మన్ అంగముత్తు
- ఘనంగా విశాఖ పోర్ట్ ఆవిర్భావ దినోత్సవం


మాట్లాడుతున్న పోర్ట్ చైర్మన్ అంగముత్తు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం పోర్ట్ అథారిటీ (వీపీఏ) 90వ ఆవిర్భావ దిన వేడుకలు శనివారం పోర్ట్ వ్యాపార భాగస్వాములు, ఉద్యోగుల మధ్య పోర్ట్ గెస్ట్‌హౌస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి పోర్ట్ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ పోర్ట్ అభివృద్ధికి పలు సూచనలిచ్చారు. త్వరలోనే పోర్ట్ వ్యాపార భాగస్వాముల సలహాలతో మారిటైం హెరిటేజ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీని సందర్శనకు నగర పౌరులకు కూడా అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ కాంప్లెక్స్‌లో 90 ఏళ్ల కాలంలో పోర్ట్‌లో వినియోగించిన వస్తువులు, పురాతన వస్తువులతోపాటు 90 వసంతాల పోర్ట్ ప్రయాణాన్ని వివరించే ఫొటోలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ కాంప్లెక్స్‌ను బీచ్‌కు అభిముఖంగా నూతనంగా నిర్మించిన కంటైనర్ టెర్మినల్‌ను కలిపే విధంగా ఏర్పాటు చేస్తామని చెప్పారు. పోర్ట్ కార్యకలాపాలను సాధారణ ప్రజలు కూడా తెలుసుకునేలా రాస్‌హిల్స్‌పైన ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నామన్నారు. కార్యక్రమంలో పోర్ట్ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ స్వామి, విభాగాధిపతులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

జూలో సందడి


వన్యప్రాణుల వేషధారణలో చిన్నారులు


ఎన్‌క్లోజరు బయట తిరుగుతున్న కనుజు

ఆరిలోవ: వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ఇందిరాగాంధీ జూ పార్కు సందడిగా మారింది. ఈ నెల 2న ఈ వారోత్సవాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. పిల్లలు, పెద్దలకు వన్యప్రాణులకు సంబంధించిన అంశాలపై పోటీలు జరిపారు. ఇందులో భాగంగా శనివారం పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. దీంతో చిన్నారులను వివిధ వన్యప్రాణుల వేషధారణ అలరించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ నందనీ సలారియా మాట్లాడుతూ వన్యప్రాణి వారోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం జూలో మారథాన్ నిర్వహించనున్నామన్నారు.


జూలో ఓ బాలుడు





గవర వీధిలో భారీ అన్నసమారాధన


54 కిలోల లడ్డూను సమర్పిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కొణతాల శ్రీనివాసరావు


అన్నసమరాధనలో పాల్గొన్న భక్తులు

గోపాలపట్నం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గౌరీ యూత్ ఆధ్వర్యంలో శనివారం గవర వీధిలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు కొణతాల శ్రీనివాసరావు సౌజన్యంతో గణేషుడికి 54 కిలోల భారీ లడ్డూను సమర్పించారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ రామాలయం వద్ద నుంచి లడ్డూను సంప్రదాయ బద్ధంగా తీసుకొచ్చి మండపంలోని గణపతికి సమర్పించి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. మధ్యాహ్నం అన్నదానంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గౌరీ సేవా సంఘం సభ్యులు సహకారం అందించారు.

నేడు అనుపు మహోత్సవం

ఆదివారం అనుపు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు గౌరీ యూత్ ప్రతినిధులు తెలిపారు. అనంతరం గణేష్ విగ్రహాన్ని ప్రతిష్ఠించిన చోట నిమజ్జనం చేస్తామని చెప్పారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన

సింధియా: ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చునని 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అన్నారు. త్రినాథపురంలో శనివారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మల్కాపురం ఏరియా మలేరియా నివారణ విభాగం ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావులు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలకు సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం, మంగళవారం ఇంట్లో అత్యవసరానికి కావాల్సిన నీటిని ఉంచుకుని, మిగిలిన పాత్రలను ఖాళీ చేసి ఎండలో ఆరబెట్టాలని సూచించారు.

ఘనంగా ఘంటసాల శతాబ్ది వేడుకలు


బాల కొండలరావుకు ఘంటసాల స్మారక పురస్కారంతో సత్కరిస్తున్న అతిథులు

మద్దిలపాలెం: ఘంటసాల శతాబ్ది వేడుకలు మద్దిలపాలెం కళాభారతిలో శనివారం ఘనంగా జరిగాయి. చెన్నైకి చెందిన కళా ప్రదర్శిని సంస్థ వ్యవస్థాపకులు, ఘంటసాల కోడళ్ల పార్వతీరవి, కృష్ణకుమారిరత్న ఆధ్వర్యంలో వేడుకగా నిర్వహించారు. ఘంటసాల ఆలపించిన మధురగేయాలకు పార్వతీ రవి ఘంటాల నృత్య నిర్దేశకత్వంలో అలరించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఘంటసాల స్మారక పురస్కారాలను నాట్య గురువులు ఏబీ బాలకొండలరావుకు, వేదాంతం రామలింగ శాస్త్రిలకు అందజేశారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ సంగీత సరస్వతి ముద్దు బిడ్డగా ఘంటసాల వేంకటేశ్వరరావు ఖ్యాతికెక్కారన్నారు. కార్యక్రమంలో రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్.జి.రఘురామారావు, డాక్టర్. సయ్యద్ రెహ్మతుల్లా, జాన్ మాస్టార్, ఘంటసాల స్పోర్ట్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు, ఎంవీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
8978872250

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com